క్లుప్తంగా

వైద్యుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న సారవకోట పీహెచ్‌సీ వైద్యురాలు

సారవకోట: మండలంలోని సారవకోట, బొంతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం హాజరైయ్యారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలియజేసేందుకే నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యామన్నారు. స్వస్తి నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమానికి హాజరైనవారు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు చేపట్టారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

హిరమండలం: ఈ నెల 25వ తేదీన వైఎస్సార్‌సీపీ పాతపట్నం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై చర్చిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

యూరియా కోసం క్యూ కట్టారు



పాతపట్నం రైతు సేవ కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు


పాతపట్నం: మండలంలోని రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని తెంబూరు, పాతపట్నం-3లోని రైతు సేవా కేంద్రాలకు బుధవారం యూరియా వచ్చిందని తెలియటంతో ఒకేసారి రైతులందరూ తరలివచ్చారు. తెంబూరు, పెద్ద లక్ష్మీపురం, రామచంద్రాపురం, వెంకటాపురం, పెద్దసరియాపల్లి, ద్వారకాపురం, పాతపట్నం, చంగుడి, సరాలి, దశరథపురం గ్రామాలకు చెందిన రైతులు వచ్చి బారులు తీరారు. వ్యవసాయశాఖ అధికారులు చేరుకుని 370 యూరియా బస్తాలు వచ్చాయని తెలిపారు. టోకెన్లు ఉన్నవారికి యూరియా అందజేశారు. మరో రెండు రోజుల్లో 8.5 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు.

కేశవరావుకు అభినందనలు



హిరమండలం: జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తులగాపు కేశవరావు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కార్యవర్గం కేశవరావును ఎన్నుకుంది. ఈ ఎన్నికలు బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కేశవరావు మాట్లాడుతూ.. విద్యారంగంతోపాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఉద్యోగోన్నతులు లభించేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. కేశవరావును ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రామస్వామినాయుడు, కార్యదర్శి సంపత్‌కుమార్, ట్రెజరర్ చందనరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ సేవలు పునరుద్ధరించాలి



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ కేంద్రం నుంచి పర్లాకిమిడి మీదుగా రుగడ వరకు వెళ్లే బస్సును ఏ.ఎస్.కవిటి వరకు పొడిగించాలని, గతంలో రొంపివలసకు ఆర్టీసీ బస్సులు ఉండేవని.. ఇప్పుడు రావడంలేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. శ్రీకాకుళం 2వ డిపో మేనేజర్ కె.ఆర్.శర్మకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రహరీ, విశ్రాంత భవనం నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను వేయాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

హిరమండలం: ఆరోగ్యంతోపాటు వైద్యసేవలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెడికవర్ వైద్యులు సూచించారు. బుధవారం హిరమండలంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు ప్రసాద్ పండా, సీపాన రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు పలు సలహాలు అందించారు. గ్రామీణ స్థాయిలో పారా మెడికల్ సిబ్బంది అందించే సేవలు ఎంతో గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు అల్ల భాగ్యరాజు, మొదలవలస శ్రీరంగ, మంచు చైతన్య, బుడుమూరు అన్నాజీరావు, శిష్ట మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

- రహదారులకు ఇరువైలా అల్లుకున్న ముళ్ల పొదలు
- వాహనాలు పక్కకు వెళ్లే అవకాశం లేదు
- ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని వైనం



కొత్తూరు-బడిగాం రోడ్డుపైకి వచ్చిన పొదలు



గులమూరు రోడ్డులో ఆకులతంపర వద్ద అలముకున్న ముళ్ల పొదలు

కొత్తూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను అద్దాల్లా మారుస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి సుమారు ఏడాదిన్నర కావస్తున్నా రహదారుల దుస్థితి అధ్వానంగానే ఉంది. ఒకవైపు రోడ్లు గోతులతో దర్శనమిస్తుండగా.. మరోవైపు ఇరువైపులా పిచ్చిమొక్కలు దట్టంగా అల్లుకున్నాయి. దీంతో మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రెండేళ్లగా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కొన్ని రూట్లలో సింగిల్ లైన్ రోడ్లు ఉన్నందున ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. కొత్తూరు మండలంలోని బడిగాం, అంగూరు, గులుమూరు, గొట్టిపల్లి, గురండి, లబ్బ, ఓంద్రుజోల, నివగాం రహదారులు, పాతపట్నం మండలంలోని తెంబూరు, బైదిలాపురం, సీది, బద్దుమర్రి రోడ్లు, హిరమండలం మండలంలోని మర్రిగూడ, పెద్దగూడ, గ్రామాల రోడ్లు, మెళియాపుట్టి మండలంలో పర్లాఖిమిడి, ఆల్ ఆంధ్రా, సిర్జిని, పద్మ, నేలబొంతు, ఇల్లాయిపురం రోడ్లలో ముళ్ల పొదలు తొలగించకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అవసరమైన చోట తొలగిస్తాం..

రహదారుల్లో దట్టంగా ఉన్న పొదలు ఉన్న ప్రాంతాలను గుర్తించి తొలగిస్తాం. రహదారుల నిర్వహణ పనులు చేస్తున్నప్పుడు ముళ్ల చెట్లను తొలగించడం జరుగుతోంది. జంగిల్ క్లియరెన్స్ చేందుకు అంచనాల్లో తక్కువ మొత్తం ఉన్నందున ఈ పరిస్థితి నెలకొంది.

– సాగర్, డీఈఈ, ఆర్అండ్‌బీ పాతపట్నం

ప్రమాదకరంగా ఉన్నాయి..



రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పిచ్చి మొక్కలు ఉన్నందున వాహనాలు నడిపేందుకు ఇబ్బంది పడుతున్నాం. సింగిల్ రోడ్లు కావడంతో ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు వెళ్లేందుకు అవకాశం ఉండడం లేదు.

– ఎం.గోపాల్, ఆటో డ్రైవర్, పూతికవలస, కొత్తూరు మండలం

ముళ్ల పొదలు తొలగించాలి..



రహదారులకు ఇరువైపులా దట్టంగా ఉన్న ముళ్ల పొదలను తొలగించాలి. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. పిచ్చిమొక్కలు తొలగించాలి. బెర్ములను బాగుచేసి ప్రమాదాలను నివారించాలి.

– పి.తవిటినాయుడు, ఆటోడ్రైవర్, కొరమ, భామిని మండలం

పీ4 సర్వే త్వరితగతిన పూర్తిచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ టి.రవి

ఆమదాలవలస: పీ4 సర్వేను త్వరితగతిని పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సచివాలయ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పీ4 సర్వే యాప్‌లో కనిపించే లబ్ధిదారులను గుర్తించి ఇంటింటికీ తిరిగి సర్వే చేసి, వారి పేదరిక స్థితిని నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన వారికి విద్య, వైద్య, ఇతర సేవల ప్రయోజనాలు అందేలా మార్గదర్శి నిబంధనల మేరకు సంబంధిత యాప్‌లలో మాపింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు లబ్ధిదారులను గుర్తించి ప్రయోజనాలను కల్పించాలన్నారు. మున్సిపల్ ఏఈ జాన్సన్, సీనియర్ అసిస్టెంట్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చింతాడను విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదు



పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్‌లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను విమర్శించే స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు లేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బొడ్డేపల్లి హరి, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కోశాధికారి అత్తులూరి రవికాంత్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. థర్మల్ పవర్ ప్లాంట్ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తున్న చింతాడ రవికుమార్‌పై కనీస అర్హతలేనివారు విమర్శించడం చేయడం సిగ్గుచేటన్నారు. నిజాయితీగా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్న చింతాడపై విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సరుబుజ్జిలి సచివాలయంలో స్థానిక మహిళా సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని చాంబర్‌లో ఎటువంటి అనుమతి లేకుండా రాజకీయ ప్రెస్‌మీట్ పెట్టేందుకు టీడీపీ కార్యకర్తలకు ఏ అర్హత ఉందని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు అర్థరహితమైన ప్రెస్‌మీట్లు పెట్టి ప్రజల్లో చులకన అవుతున్నారన్నారు. రాజకీయ ప్రెస్‌మీట్లకు సచివాలయం టీడీపీ ఆస్తి కాదన్నారు. ఈ సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమతా సైనిక్ దళ్ ప్రతినిధులు

నరసన్నపేట: సమాజంలో బడుగు, బలహీన, అణగారిన వర్గాల హక్కులను రక్షించడానికి, అంబేడ్కర్ ఆశయ సాధనకు సమతా సైనిక్ దళ్ పనిచేస్తోందని విశ్రాంత ఆర్డీఓ పీఎంజే బాబు అన్నారు. బండి వీధిలో సమతా సైనిక్ దళ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పీఎంజే బాబు మాట్లాడుతూ.. మంచి ఉద్దేశంతో అంబేడ్కర్ ఈ సంస్థను స్థాపించారన్నారు. సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ని ఆదర్శంగా తీసుకుని కులాలకు, మతాలకు, జాతి, లింగ బేధాలకు అతీతంగా మానవ హక్కుల కోసం కృషి చేస్తున్నామన్నారు. లక్ష్మీ టాకీష్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి.విష్ణుకుమార్, దువ్వారి రాజకుమార్, పేర నాగేశ్వరరావు, కురమాన సింహాచలం, కుంచి అంజిబాబు, బి.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

హిరమండలం: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎల్.ఎన్.పేట ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీదేవితో కలిసి సమీక్షించారు. మొక్కలకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. రికార్డులు పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. ఈ-శ్రమ్ యాప్ నమోదు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. మెటీరియల్ కాంపొనెంట్ నిధులకు సంబంధించి పెండింగ్ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. అర్హులైన వేతనదారులందరికీ పనులు కల్పించాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వంట, భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సాధుబాబు

కొత్తూరు: గూనభద్ర ఆర్ఆర్ కాలనీలోని ఎంపీపీ మోడల్ స్కూల్‌కు దాతలు అందజేసిన రూ.2.50 లక్షలతో నిర్మించిన వంట గది, భోజనశాలను వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ పెదకోట సాధుబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ సి.హెచ్.గోవిందరావు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి ప్రజలు సహకరించడం అభినందించాల్సిన విషయమన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.గోవిందరావు, పాఠశాల హెచ్‌ఎం పి.వి.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తం

- ఉష్ణోగ్రత పెరగడంతోనే వరి పైరుకు తెగుళ్లు
- చర్యలు తీసుకోవాలని సూచిస్తున్న శాస్త్రవేత్తలు



ఉష్ణోగ్రత ఎక్కువ కావడంతో వరి పైరుకి సోకిన ఎండు ఆకు తెగులు



ఏఓ కె.రవికుమార్

జలుమూరు:

ఉష్ణోగ్రత పెరగడంతోనే వరి పైరుకు అధికంగా తెగుళ్లు సోకుతాయి. వీటిని నివారించేందుకు అప్రమత్తతోపాటు నివారణ చర్యలు తీసుకుంటే వరి పంటను రక్షించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కింజరాపు రవికుమార్ సూచించారు. వరి నాట్లు, వెదలు వేసి దాదాపు 60 రోజులు పూర్తయ్యాయి. ముందు నాటినవి చిరుపొట్ట దశకు చేరుకున్నాయి. వరి పైరుకు ఇది తెగుళ్ల కాలమని, ఇదే సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించుకోవచ్చాన్ని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి పైరుకు అగ్గి తెగుళ్లు, పొడతెగులు, ఎండాకు తెగులు సోకింది. అయినా రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. వాతావరణం వేడెక్కడం, వరి పైరుకు కావాల్సినంత నీరు లేకపోవడం వల్ల ఈ తెగుళ్లు వ్యాప్తి చెందుతాయి.

అగ్గి తెగులు..

వరి పైరు ఆకు మీద చిన్న డైమాండ్ వంటి ఆకారంతో మచ్చలు ఏర్పడతాయి. అనంతరం ఆకు అంతా వ్యాప్తి చెంది నల్లగా మారి దుబ్బు, మొక్కంతా మాడిపోతుంది.

నివారణ..

అగ్గి తెగులు నివారణకు సైక్లోజిన్‌బాన్‌ను ఎకరాకు 120 గ్రాముల ఫౌడర్‌ను నీటిలో కలిపి 150 లీటర్లు పిచికారీ చేసుకోవాలి. పెస్టోసైక్లిన్ 18 గ్రాములు నీటిలో కలిపి ఎకరాకు 150 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.

పొడ తెగులు..

వరి పైరుకు మొదటి భాగం నుంచి ఈ తెగులు సోకుతుంది. మొదటి భాగంలో పొడ పాము మీద ఉన్న మచ్చలు ఉన్నట్లే వరి దుబ్బుకు సోకి కింద నుంచి పైకి వెళ్తోంది. వరి దుబ్బంతా మచ్చలతో మారి ఎండిపోతుంది.

నివారణ..

పొలం గట్లు మీద ఉన్న గడ్డిని పూర్తిగా తొలగించడం, అవసరమైతే ఆగడ్డిని కోసేయడం వల్ల కూడా నివారణ చేసుకోవచ్చు. వీటితోపాటు పొడ తెగులు నివారణకు కాంటాఫ్ ఎకారాకు 400 మిల్లీ లీటర్లు 150 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అవతార్ అర కేజీ ఫౌడర్‌ను తగినంత నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే మంచిది.

ఎండు ఆకు తెగులు..

వరి పైరు ఆకులుకు ముందుగా ప్రాంభమై ఈ తెగులు చివరి వరకు సోకుతోంది. ఆకుపచ్చని రంగును క్రమేపి హరించి వరి ఆకులను బూడిద రంగులోకి మార్చేస్తోంది. దీనివల్ల ఆకులతోపాటు వరి పిలకలన్నీ ఎండిపోయి దుబ్బు చచ్చిపోతుంది.

నివారణ..

ఎండు ఆకు నివారణకు ఫ్లాంటా మాసిన్ 100 గ్రాములు, 200 గ్రాములు ఎండోఫిల్ జెడ్-78 పిచికారీ చేసుకోవాలి.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌తో ధర్మాన కృష్ణదాస్, చింతాడ రవికుమార్, కేవీజీ సత్యనారాయణ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న కోట గోవిందరావు, చిత్రంలో ధర్మాన కృష్ణదాస్, తదితరులు



సమావేశానికి హాజరైన పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సమావేశానికి హాజరైన కేవీజీ సత్యనారాయణ, కరిమి రాజేశ్వరరావు, దుంపల లక్ష్మణరావు

ఆమదాలవలస: తాడేపల్లిలో గల వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దుంపల లక్ష్మణావు, కరిమి రాజేశ్వరరావు, కె.వి.జి సత్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు ఉన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్ జగన్ సూచించారు.



వైఎస్ జగన్‌తో తమ్మినేని చిరంజీవినాగ్

విద్యతోపాటు సామాజిక సేవ అవసరం

- ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం



మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకుడు రవికుమార్

నరసన్నపేట: విద్యతోపాటు సామాజిక సేవ, పని పట్ల గౌరవం, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత చాలా అవసరమని, దీనిని విద్యార్థులకు తెలియజేడమే ఎన్‌ఎస్‌ఎస్ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని కళాశాలలో బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు సమాజంలో మంచి గౌరవం ఉంటుందన్నారు. ప్రతీ విద్యార్థి సామాజిక సేవకు ముందుకు రావాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ, తెలుగు అధ్యాపకుడు రవికుమార్ మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు, నిరక్షరాస్యత, లింగ వివక్ష, సామాజిక కట్టుబాట్లపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

29న ఉపకరణాల ఎంపిక శిబిరం

హిరమండలం: ఈ నెల 29న ప్రత్యేకావసరాల గల వారికి ఉపకరణాల ఎంపికకు ప్రత్యేక శిబిరాన్ని శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎం.కె.మిశ్రో బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. పీఎం మోదీ పుట్టినరోజు పురస్కరించుకుని విజయనగరం జిల్లాకు చెందిన గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రత్యేకావసరాలు కలిగినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ కాపీ, రేషన్‌కార్డు, మూడు పాస్ ఫొటోలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 9989371952, 9490346899 నంబర్లను సంప్రదించాలన్నారు.

జానపద గ్రూప్ డాన్స్‌లో ప్రథమ స్థానం



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆమదాలవలస: డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ వర్సిటీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన జానపద గ్రూప్ డాన్స్‌లో ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానాన్ని సాధించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జలుమూరు రవిబాబు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన రవిబాబును సన్మానించారు. ఉత్తమ వాలంటీర్లుగా మావుడూరు సింధు, మావుడూరి శర్మను సత్కరించారు. రవిబాబుకు ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

28న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఆమదాలవలస: ఈ నెల 28వ తేదీన పొందూరు యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయి పోటీలను యంగ్ స్టార్ యూత్ క్లబ్ పొందూరు, ఎన్వైకే అనుబంధ సంస్థ రూరల్ స్పోర్ట్స్ క్లబ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకార పురుషులు, మహిళలు తమ ఆధార్ కార్డు, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, స్కూల్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకొని ఉదయం 8 గంటలకు పొందూరులోని నెహ్రూ పార్క్ వద్దకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఐ.భాస్కరరావు, యంగ్ స్టార్ యూత్ క్లబ్ కార్యదర్శులు ధర్మవరపు పోలినాయుడు, మల్లిక రమణమూర్తి (బుజ్జి), ఫోన్ నంబర్లకు 95507 48966, 730655 99118 ఆర్గనైజింగ్ కమిటీని సంప్రదించాలని తెలియజేశారు.

అన్నపూర్ణగా..



బూర్జ: తమలపాకులతో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: ఉజ్జయిని మహాకాళి ఆలయంలో అన్నపూర్ణదేవిగా దుర్గాదేవి

సారవకోట: మండల కేంద్రంలోని ఉజ్జయిని మహాకాళి ఆలయంలో అమ్మవారిని బుధవారం అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలు చేశారు. శరన్నావరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని రోజుకు ఒక అవతారంలో అలంకరించి పూజలు చేస్తున్నట్లు అర్చకులు శ్రీనివాస శర్మ తెలిపారు.అవలింగి నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

పాతపట్నంలో..

పాతపట్నం: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు బుధవారం అన్నపూర్ణదేవిగా పూజలు అందుకున్నారు. అమ్మవారి ఆలయ ఆవరణలోని యోగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్లాకిమిడి, పాతపట్నంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

బూర్జలో..

బూర్జ: బూర్జ గ్రామంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి అమ్మవారికి భక్తులు వేయి తమలపాకులతో బుధవారం పూజలు చేశారు. శ్రీనివాస వర్తక సంఘం, శ్రీదేవి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.